గురువారం 17-10-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: సంచిక: 485 జీలు: | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616

email: mundadugu111@gmail.com



## న్యాయం చేస్తేనే పోలీస్ వ్యవస్థపై నమ్మకం

- నిరంతరం నేర్చుకుంటూ, తప్పులు సరిదిద్దుకోవాలి
- పోలీస్ డ్యూటీ మీట్‌లో డిజిపి జితేందర్

ముందడుగు హైదరాబాద్

న్యాయం జరిగితేనే బాధితులకు పోలీసు వ్యవస్థపై నమ్మకం వస్తుందని, సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు శక్తి వంచన లేకుండా పని చేయాలని తెలంగాణ డిజిపి జితేందర్ తెలిపారు. రాజేంద్రనగర్‌లోని పోలీసు అకాడమీలో తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మొదటి పోలీస్ డ్యూటీ మీట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో మొదటి పోలీసు డ్యూటీ మీట్‌లో పాల్గొనడం మిగతా 2లో



## మూడేళ్లుగా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు

### మా ఆదేశాలు ఎందుకు పాటించట్లేదు

### పంజాబ్, హరియాణాపై సుప్రీంకోర్టు ఆగ్రహం

ముందడుగు ఢిల్లీ

ఇది రాజకీయ అంశం కాదు. హరియాణా దాఖలు చేసిన అఫిడవిట్ చూశాం. అందులో మా ఆదేశాలు పాటిస్తున్నట్లు లేదు. సీఏక్యూఎం ఆదేశాలను ఉల్లంఘించి పంట వ్యర్థాల దహనానికి పాల్పడుతున్నవారిపై పంజాబ్ ప్రభుత్వం గత మూడేళ్లుగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు ఎందుకు? అని సుప్రీంకోర్టు పంజాబ్, హరియాణా ప్రభుత్వాలను ప్రశ్నించింది. ఈ సమస్యను మిగతా 2లో



జైల్లోనే చంపేందుకు కుట్ర పన్నారు..

మిగతా 5లో




ఆమెపై 20సార్లకు పైగా హత్యాయత్నాలు జరిగాయి

మిగతా 3లో



60ఏళ్ల వయసులో నీట్ యూజీ పాసయ్యాడు

మిగతా 4లో



9మంది వీవీపీలకు ఎన్ఎస్‌జీ సెక్యూరిటీ

మిగతా 5లో

## ఐఏఎస్‌లు ఉన్నది ప్రజా సేవ కోసమే..

- క్యాట్ ఎక్కడ ఆర్డర్ ఇస్తే అక్కడికి వెళ్లాలి
- తెలంగాణ హైకోర్టులో ఐఏఎస్‌లకు దక్కని ఊరట

ముందడుగు తెలంగాణ

ఐఏఎస్‌లు ఉన్నది ప్రజాసేవకోసమే.. క్యాడ్ ఎక్కడికి ఆర్డర్ ఇస్తే.. అక్కడికి వెళ్లాలని తెలంగాణ హైకోర్టు తెలిపింది. ఏపీలో ప్రజలు వరదలతో బాధపడుతుంటే, వారికి సేవ చెయ్యాలని మీకు లేదా అని హైకోర్టు ప్రశ్నించింది.




02

## దేశంలో పలు విమానాలకు బాంబు బెదిరింపులు

### మూడు రోజులుగా 12 విమాన సర్వీసులకు బెదిరింపులు

ముందడుగు జాతీయం:




మూడు రోజులుగు భారత్‌కు చెందిన పలు విమాన సర్వీసులకు 12 బాంబు బెదిరింపులు వచ్చాయి. తాజాగా ఆకాశ, ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానాలకు బెదిరింపులు వచ్చాయి. దీంతో బెంగళూరుకు బయలుదేరిన ఆకాశ విమానాన్ని తిరిగి దిల్లీలో అత్యవసర ల్యాండింగ్ చేయాల్సి వచ్చింది. మరోవైపు దాదాపు 200 మంది ప్రయాణికులతో వెళ్తున్న ముంబయిదిల్లీ ఇండిగో మిగతా 2లో

ముందడుగు
గురువారం, 17-10-2024, హైదరాబాద్



# ఐఏఎస్‌లు ఉన్నది ప్రజా సేవ కోసమే..

(మొదటి పేజీ తరువాయి)

ఐఏఎస్‌ల బాధ్యతను హైకోర్టు గుర్తు చేసింది. తెలంగాణలోనే ఉంటామనడం సరికాదన్న హైకోర్టు.. అసలు రిపోర్ట్ చెయ్యకుండా విచారణ చెయ్యమనడం సరికాదని తెలిపింది. ముందు రిపోర్ట్ చెయ్యాలని సూచించింది. అసలు ఈ విషయంలో తాము జోక్యం చేసుకోవడం సరికాదని హైకోర్టు తెలిపింది. అంతేకాదు.. స్టే ఇస్తే, ఇక ఈ అంశం ఎప్పటికీ తేలదనీ, స్టేలతోనే కాలం గడుస్తుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఇప్పుడు ఐఏఎస్‌లు రిపోర్ట్ చెయ్యాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఇక వారు తెలంగాణ నుంచి రిలీవ్ కావాల్సి ఉంటుంది. లేదంటే వారు మళ్లీ న్యాయపోరాటం చెయ్యాల్సి ఉంటుంది. ఐతే.. రిపోర్ట్ చెయ్యడానికి అక్టోబర్ 16 సాయంత్రం 5 గంటల వరకే టైమ్ ఉంది కాబట్టి.. ఐఏఎస్‌లు ఏపీకి వెళ్లక తప్పని పరిస్థితి కనిపిస్తోంది.

# న్యాయం చేస్తేనే పోలీస్ వ్యవస్థపై నమ్మకం

(మొదటి పేజీ తరువాయి)



సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం పోలీసుల్లో బృంద స్ఫూర్తిని పెంచుతుందని తెలిపారు. అన్ని కేసులను సాంకేతిక ఆధారాలతో ఛేదించాలని సూచించారు. న్యాయం జరిగితేనే బాధితులకు పోలీసు వ్యవస్థపై నమ్మకం వస్తుందని చెప్పారు. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు శక్తి వంచన లేకుండా పని చేయాలన్నారు. నిరంతరం నేర్చుకుంటూ, తప్పులు సరిదిద్దుకుంటూ, జాగ్రత్తలు పాటిస్తేనే నేరాల ఛేదన సాధ్యమవుతుందని తెలిపారు. పోలీసు డ్యూటీ మీట్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా సీఎస్ శాంతి కుమారి హాజరయ్యారు. నేటి నుంచి 19వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన 400 మంది పోలీసులు పాల్గొన్నారు. దైనందిన డ్యూటీలో భాగంగా కేసుల విచారణలు, మెలకువలపై ఇక్కడ పోటీలు ఏర్పాటు చేశారు. సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, కంప్యూటర్ అవేర్‌నెస్ తదితరాలపై పోటీలున్నాయి. కేసుల ఛేదన, ఆధారాల సేకరణపై ఉన్నతాధికారులు సూచనలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్ భగవత్, శిఖా గోయల్ సహా పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# దేశంలో పలు విమానాలకు బాంబు బెదిరింపులు


(మొదటి పేజీ తరువాయి)

విమానానికీ ఇదేవిధమైన బెదిరింపులు రావడంతో ఆ విమానాన్ని అహ్మదాబాద్‌కు దారి మళ్లించారు. ఆకాశ ఎయిర్‌లైన్స్ QP1335 విమానం 184 మంది ప్రయాణికులతో దిల్లీ నుంచి బెంగళూరుకు బయలుదేరింది. గాల్లోకి ఎగిరిన కొద్దిసేపటికే అత్యవసరంగా ల్యాండింగ్ చేయాలని పైలట్‌కు ఆదేశాలు వెళ్లాయి. దీంతో వెంటనే దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆకాశ ఎయిర్‌లైన్స్ సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. అటు ముంబయిదిల్లీ విమానం కూడా అహ్మదాబాద్‌లో సురక్షితంగా దిగినట్లు సదరు విమానయాన సంస్థ వెల్లడించింది. గడిచిన మూడు రోజులుగా అనేక విమానాలకు బాంబు బెదిరింపులు వస్తోన్న ఘటనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఇదే అంశంపై చర్చించేందుకు పార్లమెంటరీ కమిటీ బుధవారం భేటీ అయ్యింది.




# మూడేళ్లుగా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు

(మొదటి పేజీ తరువాయి)




పరిష్కరించేందుకు ఆ రాష్ట్రాలు ఎలాంటి సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదని మండిపడింది. ఈవిషయంలో తాము గతంలో జారీ చేసిన ఉత్తర్వులను పాటించకపోతే కోర్టు ధిక్కరణగా పరిగణించాల్సి వస్తుందని హెచ్చరించింది. "పంట వ్యర్థాల దహనం కారణంగా ఏ ప్రాంతంలో మంటలు చెలరేగుతున్నాయో, ఎంత పరిమాణంలో ఉన్నాయో.. ఇలా అన్ని వివరాలను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మీకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూనే ఉంది. అలాంటప్పుడు మంటలు చెలరేగిన ప్రాంతాలను గుర్తించకలేకపోతున్నామని మీరు చెప్పడం సరికాదు. కేవలం నామమాత్రంగా జరిమానాలు విధిస్తామంటే సరిపోదు. కఠిన చర్యలు తీసుకోవాలి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఉల్లంఘనల కట్టడిలో విఫలమైనందుకు గానూ పంజాబ్, హరియాణా ప్రభుత్వ అధికారులపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని గాలి నాణ్యతా మేనేజ్‌మెంట్ కమిషన్‌ను ఆదేశించింది.

ముందడుగు
గురువారం, 17-10-2024, హైదరాబాద్



# మీకు ఓటు వేశా..
# నాకు పెళ్లి చేయండి

## ఎమ్మెల్యే వాహనం ఆపి అడిగిన 44ఏళ్ల వ్యక్తి

ముందడుగు ఉత్తరప్రదేశ్

ఒక వ్యక్తి ఎమ్మెల్యే వద్దకు పరిగెత్తుకొచ్చి నీకు ఓటేశానని తనకు పెళ్లి చేయాలని కోరాడు. ఆ వ్యక్తి ఎమ్మెల్యేతో జరిపిన సంభాషణ ప్రస్తుతం నెట్టింట్లో వైరల్‌గా మారింది. ఉత్తరప్రదేశ్‌లోని చర్ఖారీ నియోజకవర్గానికి బ్రిజ్‌భూషణ్ రాజ్‌పుత్ ఎమ్మెల్యేగా ఉన్నారు. తన వాహనంలో వెళ్తూ మహోబా ప్రాంతంలో పెట్రోల్ కొట్టించుకునేందుకు ఒక బంక్ వద్ద బండిని ఆపారు. అక్కడే పనిచేస్తోన్న స్థానిక వ్యక్తి అఖిలేంద్ర ఖరే..ఎమ్మెల్యేను చూసి ఆయన వద్దకు పరిగెత్తారు. ఏదైనా సాయం కోసం వస్తున్నాడేమో అని బ్రిజ్‌భూషణ్ భావించారు. కానీ అఖిలేంద్ర మాత్రం తాను పెళ్లి చేసుకునేందుకు ఒక అమ్మాయిని చూడాలని అడగడంతో ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. అప్పుడు వారిద్దరు ఇలా మాట్లాడుకున్నారు.

ఎమ్మెల్యే: నీ వయసెంత..?

అఖిలేంద్ర: త్వరలో 44 వస్తాయి

ఎమ్మెల్యే: అయినా ఒక అమ్మాయిని చూడాలని నన్నే ఎందుకు అడుగుతున్నావు..?

అఖిలేంద్ర: నా ఓటు మీకే వేశా (అంటూ తడుముకోకుండా సమాధానం ఇచ్చాడు)

ఎమ్మెల్యే: అయితే నేను నీకు పెళ్లి చేయాలన్నమాట. మరి ఎలాంటి అమ్మాయి కావాలేంటి..?

కొన్ని వర్గాలకు చెందిన వారు వద్దని అఖిలేంద్ర సమాధానం ఇవ్వగా.. అలా ఎప్పుడూ వివక్ష చూపకూడదని, ఎవరితో రాసిపెడితే వారితోనే వివాహం జరుగుతుందని ఎమ్మెల్యే సమాధానం ఇచ్చారు. "నీకు త్వరగా పెళ్లి కావాలని కోరుకుంటున్నా. నాకు ఓటేశావు కదా.. నా వంతు ప్రయత్నం చేస్తా. ఇంతకీ నీ జీతం ఎంత..?" అని అడిగారు. తనకు రూ.6వేల జీతం వస్తుందని, 13బిగాల భూమి ఉందని ఆ వ్యక్తి చెప్పారు. ఇలా వారిద్దరి మధ్య జరిగిన సంభాషణ నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. దీనిపై నెటిజన్లు సరదా కామెంట్లు పెట్టారు.

# ఆమెపై 20సార్లకు పైగా హత్యాయత్నాలు జరిగాయి

## ఇప్పుడామె జమ్ముకశ్మీర్ ఏకైక మహిళా మంత్రి
## ఆవిడే దక్షిణ కశ్మీర్‌కు చెందిన సకీనా ఈటూ

ముందడుగు జమ్ముకశ్మీర్

జమ్మూకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ లీడర్ ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేశారు. ఆయనతో పాటు ప్రమాణం చేసిన మంత్రుల్లో ఒకే ఒక్క మహిళ ఉన్నారు. ఆవిడ పేరు సకీనా ఈటూ. దక్షిణ కశ్మీర్‌కు చెందిన సకీనా ఈటూ కుల్గామ్ జిల్లాలోని డీహెజ్ పోరా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. ఆమె పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి గుల్జార్ అహ్మద్ దర్‌పై 17,449 ఓట్ల మెజార్టీతో గెలుపు దక్కించుకున్నారు. ప్రముఖ రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన ఆమె నేషనల్ కాన్ఫరెన్స్‌లో వివిధ హోదాల్లో పనిచేశారు. ఆమె తండ్రి వలీ మోహమ్మద్ ఈటూ.. ఈ పార్టీలో కీలకంగా వ్యవహరించారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. ఆయన 1994లో హత్యకు గురయ్యారు. ఆ తర్వాత తండ్రి వారసత్వాన్ని అందుకొని ముందుకు సాగుతోన్న ఆమె సోదరుడిని 2001లో ఉగ్రవాదులు బలిగొన్నారు. అప్పుడు ఆమె వైద్యవిద్యను అభ్యసిస్తున్నారు. తండ్రి, సోదరుడి మరణాలతో వెనకడుగు వేయని ఆమె రాజకీయ ప్రయాణాన్ని మొదలుపెట్టారు. ఆమెపై కూడా 20 సార్లకు పైగా హత్యాయత్నాలు జరిగాయి. వాటన్నింటిని దాటుకొని.. జమ్మూకశ్మీర్ ప్రభుత్వంలో వివిధ హోదాల్లో పనిచేశారు. లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు నిర్వర్తించారు. పర్యాటక శాఖ, విద్యా శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2008 నుంచి 2014 వరకు సామాజిక సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నారు. 53 ఏళ్ల వయసులో తాజాగా కేబినెట్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. జమ్మూకశ్మీర్‌లో ప్రజాదరణ ఉన్న అతి కొద్దిమంది మహిళా నేతల్లో ఈమె ఒకరు. సామాజిక సంక్షేమం, మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందారు.



# ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తేనే సహకారం

## పాకిస్తాన్‌లో భారత విదేశాంగ మంత్రి జై శంకర్

ముందడుగు జాతీయం



ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తేనే సహకారం ఉంటుందని భారత విదేశాంగ మంత్రి జై శంకర్ అన్నారు. ఇస్లామాబాద్‌లో జరుగుతున్న షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. మంగళవారం రాత్రి పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఇచ్చిన విందుకు ఆయన హాజరయ్యారు. బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని నిర్మూలించకుండా రెండు దేశాల మధ్య సహకారం కుదరదు అని మంత్రి జైశంకర్ తెలిపారు. వాణిజ్యం, ఎనర్జీ, కనెక్టివిటీ లాంటి రంగాల్లో సహకారం కొనసాగాలంటే, సీమాంతర ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటువాదం ఆగిపోవాలన్నారు. ఎస్సీవో సదస్సులో ఆయన ప్రసంగిస్తూ సంయుక్త గౌరవం, సమానత్వం మధ్య సహకారం జరగాలన్నారు. ప్రాంతీయ సమగ్రత, సౌభ్రాత్వాన్ని దేశాలు గుర్తించాలన్నారు. పాక్ ప్రధాని షెహబాజ్ నేతృత్వంలో ఎస్సీవో మీటింగ్ జరుగుతోంది. ఎస్సీవో సభ్య దేశాల మధ్య నమ్మకం ఉంటే సహకారం లాభదాయకంగా ఉంటుందన్నారు. గ్రూపులో ఉన్న దేశాలు ఒక్కటిగా ముందుకు వెళ్లాలన్నారు. ఏకపక్షంగా కాకుండా, చాలా నిస్వార్థపూరిత భాగస్వామ్యాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సరిహద్దుల వద్ద ఉగ్రవాదం, తీవ్రవాదం లాంటి కార్యకలాపాలు పెరిగితే, అప్పుడు వాణిజ్యం, ప్రజా రవాణాకు ఆటంకాలు ఎదురవుతాయని జైశంకర్ చెప్పారు

# చిట్టీల పేరుతో 20 కోట్ల టోకరా

ముందడుగు హైదరాబాద్

చిట్టీల పేరుతో దాదాపు రూ.20 కోట్ల టోకరా వేసి, పరారైన వ్యక్తిపై సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం...కుత్బుల్లాపూర్, చింతల్‌లోని శ్రీసాయి కాలనీకి చెందిన సీతారామయ్య, అతడి బంధువు మురళితో కలిసి స్థానికంగా చిట్ ఫండ్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో వివిధ రకాల చిట్టీల పేరుతో దాదాపు 200 మంది వద్ద నుంచి సుమారు రూ. 20 కోట్ల వరకు డబ్బులు వసూలు చేశాడు. చిట్టీ సమయం ముగిసినా డబ్బులు తిరిగి చెల్లించకపోవడంతో బాధితులు చింతల్‌లోని సీతారామయ్య ఇంటికి వచ్చి చూడగా అతడు కుటుంబంతో సహా పరారయ్యాడు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితులు సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

ముందడుగు
గురువారం, 17-10-2024, హైదరాబాద్

# 60ఏళ్ల వయసులో నీట్ యూజీ పాసయ్యాడు

## మెడిసిన్ కావాలనే కలను సాధించుకున్నాడు

ముందడుగు ప్రత్యేకం



మనిషి నేర్చుకోవాలనే తపన ఉండాలి కాని దానికి వయసుతో సంబంధమే లేదు. ఏ వయసులోనైనా ఏదైనా నేర్చుకోవచ్చు. అలాంటిది 60 ఏళ్ల వయసులో ఓ వ్యక్తి దేశంలోనే అత్యంత కఠినమైన పరీక్షల్లో ఒకటైన 'NEET UG'లో పాసై ఎందరినో ఆశ్చర్యపరిచారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన జై కిషోర్ ప్రధాన్(64)కి మెడిసిన్ చదవాలనే ఆసక్తి ఉండేది. కాని కొన్ని కారణాల వల్ల బ్యాంక్ ఉద్యోగిగా మారిపోయాడు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో చేరి డిప్యూటీ మేనేజర్‌గా రిటైర్ అయ్యారు. బ్యాంకింగ్ రంగంలో పనిచేసినా మెడిసిన్ చేయాలన్న ప్యాషన్ ఏ మాత్రం తగ్గలేదు. దీంతో రిటైర్ అయ్యాక కీలక నిర్ణయం తీసుకున్నారు. అందరూ రిటైర్ అయ్యాక వేర్వేరు ప్రణాళికలు వేసుకుంటుంటే.. ఈయన మాత్రం తిరిగి చదవాలని డిసైడ్ అయ్యారు. ఓ వైపు కుటుంబ బాధ్యతలు, ఒత్తిళ్లు ఉన్నప్పటికీ వాటన్నిటినీ నిర్వర్తిస్తూనే మెడిసిన్ చదువుపై ఫోకస్ పెట్టారు.

### పక్కా ప్లానింగ్‌తో ప్రిపరేషన్

స్టెతస్కోపు మెడలో వేసుకోవాలన్న జై కిషోర్ సంకల్పం ముందు ఆయన వయసు తలవంచింది. పక్కా ప్రణాళికతో ఆయన నీట్ ప్రిపరేషన్ మొదలు పెట్టారు. ఇందుకోసం ఓ ఆన్‌లైన్ కోచింగ్ సెంటర్‌లో జాయిన్ అయ్యారు. టఫ్ సిలబస్‌ని ప్లానింగ్ ప్రకారం చదవడం ప్రారంభించారు. కోచింగ్ సెంటర్ నిర్వాహకులు సూచించిన టిప్స్ పాటిస్తూ ఎప్పటికప్పుడు తనని తాను మెరుగు పరుచుకున్నారు. ప్రాక్టీస్ ఎగ్జామ్స్ రాస్తూ ఫ్రెష్ క్యాండిడేట్లకు పోటీనిచ్చేలా ప్రిపేర్ అయ్యారు. ఆయన చూపిన డెడికేషన్, పట్టుదలకి నీట్ ర్యాంక్ దాసోహం అయింది. 2020లో మెడికల్ ఎంట్రన్స్ ఎగ్జామ్‌ని క్లియర్ చేసి వీర్ సురేంద్ర సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్‌లో సీటు సంపాదించారు.

MORRIS GARAGES
Since 1924

# ఎంజీ విండ్సర్‌కోసం లైవ్ బిజినెస్ క్లాస్ కొత్త కాంపైన్‌ను ప్రారంభించిన జెఎస్ డబ్ల్యూ ఎంజీ

ముందడుగు హైదరాబాద్

భారతదేశపు మొదటి ఇంటిలిజెంట్ సియూవీ ఎంజీ విండ్సర్ కోసం చీల్ ఎక్ భాగస్వామంతో జెఎస్ డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా ' లైవ్ బిజినెస్ క్లాస్' పేరుతో ఒక కొత్త ఉత్తేజభరితమైన కాంపైన్ ను ప్రారంభించింది. కాంపైన్ గురించి వ్యాఖ్యానిస్తూ,ఉదిత్ మల్హోత్ర, మార్కెటింగ్ హెడ్, జేఎస్ డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా, ఇలా అన్నారు, "ద లైవ్బిజినెస్ క్లాస్' కాంపైన్ అనేది ప్రీమియం ప్రయాణాన్ని పునర్నిర్వచించడం గురించి తెలియచేస్తుంది. విమానంలో బిజినెస్ తరగతిలో ప్రయాణించడం వంటి డ్రైవింగ్ అనుభవాన్ని పెంచుకోవాలని కోరుకునే వినియోగదారులతో సంబంధం సృష్టించడమే మా లక్ష్యం. అదే విధంగా, ఎంజి విండ్సర్ తో, భారతదేశపు రహదారులకు విలాసం, వినూత్నత,సుస్థిరతలను కలిపే ప్రపంచ స్థాయికి చెందినఅనుభవాన్ని తీసుకురావడానికి మేము లక్ష్యాన్ని కలిగి ఉన్నాం అన్నారు.



# పింగిలి శ్రీపాల్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపిద్దాం

## ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కోకిల శ్రీరంగం

ముందడుగు ములుగు

పి ఆర్ టి యు టిఎస్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నల్లగొండ, వరంగల్, ఖమ్మం నియోజకవర్గానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పిఆర్టీయు రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్ రెడ్డికి అభ్యర్థిత్వం రావడం మనమందరం స్వాగతించాల్సిన పరిణామమని ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కోకిల శ్రీరంగం అన్నారు. ములుగు జిల్లా పిఆర్టియు టీఎస్ పక్షాన ఏటూరునాగారం మండలంలోని అన్ని ఉన్నత విద్యాసంస్థల్లో పనిచేస్తున్నటువంటి ఉపాధ్యాయ ఉద్యోగ సోదర సోదరీమణులందరు కూడా ఓటరు నమోదు చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తూ వారికి దరఖాస్తు ఫారం నం19 అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎస్కే లయానమ్, ప్రధాన కార్యదర్శి రంజిత్, ములుగు జిల్లా గౌరవ అధ్యక్షులు దేవులపల్లి సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు చెరుకుల ధర్మయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కోడి వెంకటేశ్వర్లు తదితరులు ఓటర్ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ₹10 నాణేలపై ప్రచారాన్ని నిర్వహిస్తున్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

HDFC BANK
We understand your world

ముందడుగు హైదరాబాద్

భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ బ్యాంక్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, తెలంగాణలోని 33 జిల్లాల్లో విస్తరించిన తన 430 శాఖలు మరియు 542 బీసీల ద్వారా ₹10 నాణేల స్వీకరణపై రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజుల పబ్లిక్ అవేర్‌నెస్ క్యాంపెయిన్ (పిఎసి) నిర్వహించింది. ₹10 నాణేల చట్టపరమైన చెల్లుబాటుకు సంబంధించి ఉన్న అపోహలను తగ్గించడం, ₹10 నాణేలపై ఎక్కువ నమ్మకాన్ని, విశ్వాసాన్ని పెంపొందించడంలో సహాయపడే ఉద్దేశంతో పబ్లిక్ అవేర్‌నెస్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారతీయ రిజర్వు బ్యాంకు, హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం సహకారాన్ని అందించింది. ఈ సందర్భంలో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మరియు రీజినల్ హెడ్ వెంకటేష్ చల్లావర్ మాట్లాడుతూ, "రాష్ట్రంలోని చాలా నగరాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం మాకు చాలా సంతోషంగా ఉంది. ₹10 నాణేల అంగీకారంపై ఈ పబ్లిక్ అవేర్‌నెస్ క్యాంపెయిన్ రోజువారీ లావాదేవీలలో నాణేల వినియోగాన్ని, పెద్ద మొత్తంలో నగదు చలామణిని బలోపేతం చేస్తుంది. ఈ చొరవకుకు తమ మార్గదర్శకత్వం, మద్దతు అందించిన భారతీయ రిజర్వు బ్యాంకుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము" అని తెలిపారు.

ముందడుగు
గురువారం, 17-10-2024, హైదరాబాద్

# 9మంది వీఐపీలకు ఎన్‌ఎస్‌జీ సెక్యూరిటీ తొలగింపు

## కమాండోల స్థానంలో సీఆర్‌పీఎఫ్‌కు బాధ్యతలు.. టెర్రర్ ఆపరేషన్లపైనే ఎన్‌ఎస్‌జీ దృష్టి

ముందడుగు జాతీయం

దేశంలో 9మంది వీఐపీలకు నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్(ఎన్‌ఎస్‌జీ) కమాండోలను విత్ డ్రా చేసుకుని వారి స్థానంలో సీఆర్‌పీఎఫ్ కమాండోలకు బాధ్యతలు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించినట్లు అధికారిక వర్గాలు బుధవారం తెలిపాయి. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రత్యేకంగా శిక్షణ పొందిన సిబ్బందితో కూడిన తాజా బెటాలియన్‌ను కూడా మంజూరు చేసింది. ఇటీవల పార్లమెంట్ సెక్యూరిటీ విధుల నుంచి ఉపసంహరించుకోబడిన సీఆర్‌పీఎఫ్‌వీఐపీ సెక్యూరిటీ వింగ్‌ని ప్రముఖుల భద్రత కోసం వినియోగించనున్నారు. ప్రస్తుతం దేశంలో ఎన్‌ఎస్‌జీ 'బ్లాక్ క్యాట్' కమాండోల భద్రతలో 9 మంది వీఐపీలు ఉన్నారు. వీరందరికి కూడా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్)తో భద్రత కల్పిస్తారు. ఈ తరహా "జెడ్ ప్లస్" కేటగిరీలో ఉన్న వారిలో ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, యూపీ మాజీ సీఎం మరియు బీఎస్పీ అధినేత్రి మాయవతి, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీరియర్ బీజేపీ నేత ఎల్‌కే అద్వానీ, కేంద్ర షిప్పింగ్ మంత్రి సర్బానంద సోనోవాల్, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం రమణ్ సింగ్ ఉన్నారు. జమ్మ కాశ్మీర్ మాజీ సీఎం గులాం నబీ ఆజాద్, ఎన్సీ నేత ఫరూఖ్ అబ్దుల్లా వంటి ప్రముఖులు కూడా ఈ సెక్యూరిటీ కవర్‌లో ఉన్నారు.

# జైల్లోనే చంపేందుకు కుట్ర పన్నారు..

## బిజెపీపై అరవింద్ కేజ్రీవాల్ ఆరోపణ

ముందడుగు ఢిల్లీ


జైల్లో ఉన్న తనకు ఇన్సులిన్ ఇవ్వకుండా తనను చంపేందుకు భాజపా కుట్ర పన్నిందని అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. ఈ మేరకు బుధవారం జన సంపర్క్ కార్యక్రమంలో ఆయన వ్యాఖ్యానించారు. అయితే తిహాడ్ జైలు అధికారవర్గాలు ఈ ఆరోపణలను ఖండించాయి. ఆయనకు అన్ని వైద్యసౌకర్యాలు కల్పించినట్టు స్పష్టం చేశాయి. 'నాకు మధుమేహం లెవల్స్ పెరగడంతో.. రోజు నాలుగు ఇన్సులిన్ ఇంజెక్షన్లు తీసుకుంటాను. జైల్లో ఉన్న నేను ఇన్సులిన్ తీసుకోకపోతే కిడ్నీలు పాడైపోయి చనిపోయేలా వాళ్లు (భాజాపాను ఉద్దేశిస్తూ) కుట్రలు పన్నారు. మీ అందరి ఆశీస్సులతో నేను బయటకు వచ్చాను. గత 10 ఏళ్లలో లెఫ్టినెంట్ గవర్నర్‌ను అడ్డంపెట్టుకుని దిల్లీలో అనేక అభివృద్ధి ప్రాజెక్టులు ఆపేందుకు ప్రయత్నించారు. కానీ, నేను వారి ప్రయత్నాలను తిప్పికొట్టాను. దిల్లీలో పనులు ఎందుకు ఆపాలనుకుంటున్నారు?. పంజాబ్‌లో మా పార్టీ విజయం సాధించాక.. దిల్లీలో పనులు ఆపకపోతే దేశవ్యాప్తంగా ఆప్ అధికారంలోకి వస్తుందని భయపడుతున్నారు. నేను జైల్లో ఉండగా దిల్లీ అభివృద్ధి పనులు



ఆపేశారు. తిరిగి నేను జైలు నుంచి వచ్చాక మా పార్టీ వాటిని ప్రారంభించింది' అని ఆయన పేర్కొన్నారు. తాను ఢిల్లీ ముఖ్యమంత్రిగా రాజీనామా చేయడానికి గల కారణాలను వివరిస్తూ దిల్లీ ఓటర్లకు కేజ్రీవాల్ లేఖ రాశారు.

# జమ్ముకశ్మీర్ సీఎంగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారం

ముందడుగు జమ్ముకశ్మీర్



జమ్ముకశ్మీర్ నూతన ముఖ్యమంత్రిగా నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అగ్ర నేత ఒమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారం చేశారు. జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. శ్రీనగర్‌లోని 'షేర్ యే కశ్మీర్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సెంటర్'లో ఈ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీలకు చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. వారిలో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, పీడీపీ అధ్యక్షురాలు, జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ, ఆప్ సీనియర్ నేత సంజయ్ సింగ్, సీపీఐ నేత డీ రాజా తదితరులు ఉన్నారు. ఒమర్ అబ్దుల్లా గతంలో కూడా జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత బీజేపీ, పీడీపీ కూటమి అక్కడ అధికారం చేపట్టింది. 2018లో కూటమి సర్కారు కూలిపోవడంతో రాష్ట్రపతి పాలన అమల్లోకి వచ్చింది. ఆ తర్వాత కేంద్రం జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దుచేసింది. అనంతరం ఇప్పుడే తొలసారిగా జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి.